సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 28 । ఆగస్టు । 2023



విస్తారంగా మిర్చి సాగు

జిల్లాలోని మెట్ట ప్రాంతంలో మిర్చి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ మేరకు లింగపాలెం మండలంలో మిర్చినారు తోటలు వేస్తున్నారు. 8లో



చురుగ్గా ఆధార్ సీడింగ్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్ మీటర్లకు ఆధార్ సీడింగ్ చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే 50 శాతం అనుసంధాన ప్రక్రియ పూర్తయ్యింది. 8లో



పోటెత్తిన భక్తులు

కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేశారు. 8లో

న్యూస్‌రీల్

మావుళ్లమ్మ జాతర ప్రారంభం



ఊరేగింపులో పాల్గొన్న శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం సుంకర పద్దయ్య వీధి 25వ వార్డులో మావుళ్లమ్మవారి 49వ జాతర మహోత్సవాన్ని ఆదివారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరణ చేసిన వాహనంపై అమ్మవారిని ఊరేగించారు. ముందుగా ఆలయంలో విశేష పూజలు జరిగాయి. డప్పుల వాయిద్యాలు, గరగ నృత్యాలు, శక్తి వేషధారణలతో జాతర వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, మెంటే పార్థసారథి, జట్ల రాంబాబు, జెట్టి వెంకటేశ్వరరావు, రాయప్రోలు శ్రీనివాస్, గనిరెడ్డి త్రినాథ్, కోడే యుగంధర్, లంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

28న క్రీడా పురస్కారాల ప్రదానం

తణుకు: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న జిల్లాలోని ప్రతి పాఠశాలలో వేడుకలు నిర్వహించాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.జాన్సన్ తెలిపారు. గతేడాది పాఠశాల తరపున వారి విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్న అంశాల్లో ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులను అందజేయనున్నట్లు చెప్పారు. పాలకోడేరు మండలం గొరగనమూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం ఉన్నత పాఠశాల, వీరవాసరం మండలం తోలేరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మార్టేరు ఎస్‌వీజీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, అత్తిలి ఎస్‌వీఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయన్నారు. పురస్కారాలను ఈనెల 29న భీమవరంలో అందజేస్తున్నందున ఎంపిక చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు హాజరుకావాలని ఆయన కోరారు.

రాట్నాలమ్మా.. రక్షించమ్మా..



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెదవేగి : భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారం రాట్నాలకుంటలోని రాట్నాలమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి పూజా టికెట్లపై రూ.35,835, విరాళాల రూపంలో రూ.45,430, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ 25,500, ఫొటోల అమ్మకం రూ.2,695 మొత్తంగా రూ.1,09,460 ఆదాయం లభించిందని దేవస్థానం చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు చెప్పారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అవార్డులకు ఐదు పాఠశాలల ఎంపిక

ఏలూరు (టూటౌన్): రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పాఠశాలలకు ఈనెల 29 జాతీయ స్పోర్ట్స్ దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందజేయనున్నట్టు ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29న జాతీయ క్రీడల దినోత్సవంగా ప్రకటించినట్టు చెప్పారు. పురస్కారాలకు జిల్లాలోని తొమ్మిది ఉన్నత పాఠశాలలు దరఖాస్తు చేసుకోగా వీటిలో జెడ్పీ హైస్కూల్ కామవరపుకోట, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (బాలురు) ఉన్నత పాఠశాల పెదవేగి, కస్తూరిబాయి మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల ఏలూరు, జెడ్పీ హైస్కూల్ నూజివీడు, సెయింట్ థెరిస్సా బాలికల ఉన్నత పాఠశాల ఏలూరు మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయని పేర్కొన్నారు. ఆయా పాఠశాలలకు ఈనెల 29న ఏలూరు డీఈఓ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలోని ఎంఈఓలు, డీవైఈఓలు తమ పరిధిలోని అన్ని పాఠశాలల్లో జాతీయ స్పోర్ట్స్ దినోత్సవాన్ని నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. జాతీయ ఆటల పోటీల్లో పాల్గొనటం వల్ల కలిగే గౌరవం గురించి విద్యార్థులకు తెలియజేయడంతో పాటు క్రీడల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని డీఈఓ శ్యామ్ సుందర్ సూచించారు.

కొబ్బరి ఎగుమతులు తగ్గుముఖం

- తమిళనాడు, కేరళలో పెరిగిన దిగుబడులు
- జిల్లా నుంచి మందగించిన లోడులు
- శ్రావణమాసంలోనూ పుంజుకోని మార్కెట్
- పంటపై తెగుళ్ల ప్రభావం



పాలకొల్లు సెంట్రల్: ఆరు నెలలుగా కొబ్బరి మార్కెట్ లేక రైతుల పరిస్థితి అగమ్యగోచరంలా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కొబ్బరి వ్యాపారం వేగంగా పుంజుకుంటున్న సమయంలో తమిళనాడు, కేరళలో కొబ్బరి దిగుబడులు అందుబాటులోకి రావడంతో ఇక్కడి మార్కెట్ మందగించింది. దీంతో రైతులతో పాటు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా నుంచి తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతులు ఎక్కువగా ఉంటాయి. సీజన్‌లో రోజుకు సుమారు 100 వరకు లారీలు ఎగుమతి అవుతుంటాయి. చిన్న లారీలో సుమారు 20 వేలు, పెద్ద లారీలో 30 వేల కాయలు లోడు చేస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్ తక్కువగా ఉండటంతో రోజుకు సుమారు 30 లారీలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. శ్రావణమాసం కావడంతో మార్కెట్ పుంజుకుంటుందని అందరూ ఎదురు చూశారు. అయినా ఏ మాత్రం ఫలితం లేదు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు పెరగడంతో పాటు అక్కడి కాయలు నాణ్యమైనవి కావడంతో ఇతర రాష్ట్రాల వారు అటుగా వెళుతున్నారని వ్యాపారులు చెబుతున్నారు.

జిల్లాలో ఎక్కడెక్కడంటే..

జిల్లాలో ఏలూరు, నిడదవోలు, జంగారెడ్డిగూడెం వద్ద రెడ్డిసీమ, కోరుమామిడి, చింతలపూడి, ద్వారకా తిరుమల, దేవరపల్లి, పెదవేగి, కొవ్వూరు, నల్లజర్ల, గోపాలపురం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు, పాలకొల్లు, మొగల్తూరు, పేరుపాలెం ప్రాంతాల్లో కొబ్బరి సాగు ఎక్కువగా ఉంది.



గుజరాత్ లోడుకు సిద్ధంగా ఉన్న పీచు కొబ్బరి



మహారాష్ట్రకు ఎగుమతయ్యే ఫోర్ పట్టా రకం

తగ్గుతున్న విస్తీర్ణం

జిల్లాలో గతంలో సుమారు 75 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు ఉండేది. కొబ్బరి తోటలు ఆక్వా చెరువులుగా, ఇళ్ల స్థలాలుగా మారుతుండటంతో ప్రస్తుతం 55 వేల ఎకరాల విస్తీర్ణానికి చేరినట్టు అంచనా. ఇందులో ఆక్వా చెరువు గట్ల వెంబడి ఉన్న కొబ్బరి చెట్లకు నల్లి తెగులు సోకడంతో దిగుబడులు తగ్గుతున్నాయి. కొబ్బరి కాయలపై మచ్చలు ఏర్పడటం, కాయ పరిమాణం కూడా తగ్గడంతో రైతులు ఆశించిన లాభాలు అందుకోలేకపోతున్నారు. కాయ కన్నా కొబ్బరి బొండాల ధరలు ఎక్కువగా ఉండటంతో రైతులు వాటి విక్రయాలకే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దీనివల్ల సకాలంలో నీటి కొబ్బరి దొరక్కపోవడంతో కొన్ని సందర్భాల్లో ఎగుమతులు ఉండటం లేదని వ్యాపారులు అంటున్నారు.

ఏఏ రాష్ట్రాలకు ఎగుమతులంటే..

గుజరాత్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఒడిసా, హర్యానా వంటి రాష్ట్రాల్లో సాధారణ రోజుల్లో కూడా కొబ్బరి డిమాండ్ అధికంగా ఉంటుంది. పీచుకాయను గుజరాత్‌కు, బెల్ట్ ఫోర్ పట్టా రకాన్ని మహారాష్ట్ర, గుజరాత్‌కు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. దేశంలో కొబ్బరి ఎగుమతుల్లో మన రాష్ట్రంతో తమిళనాడు, కేరళ రాష్ట్రాలు పోటీపడుతున్నాయి.

పరిశోధనా కేంద్రాలు పెరగాలి

తమిళనాడు, కేరళలో కొబ్బరి పరిశోధనా కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి. వాటి ఆధారంగా రైతులు సాగుచేస్తారు. తద్వారా నాణ్యతా ప్రమాణాలతో దిగుబడులు వస్తున్నాయి. అలాగే కొబ్బరి ఆధారిత పరిశ్రమలు అందుబాటులో ఉండటంతో అక్కడ కొబ్బరి సాగు పుష్కలంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉభయగోదావరి జిల్లాల నుంచి అధికంగా కొబ్బరి ఎగుమతులు జరుగుతుంటాయి. డాక్టర్ వైఎస్సార్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో తప్ప మరెక్కడా ప్రత్యేక కొబ్బరి పరిశోధనా కేంద్రం లేకపోవడంతో రైతులకు పంటపై సరైన అవగాహన ఉండటం లేదు.

రైతుల వద్ద కొనుగోలు ధరలు

ఆరు నెలల క్రితం	
పాతకాయ పెద్దది	రూ.11
పాతకాయ చిన్నది	రూ.7
ఆరు నెలల నుంచి..	
పాతకాయ పెద్దది	రూ.7
పాతకాయ చిన్నది	రూ.4
కొత్తకాయ పెద్దది	రూ.6
కొత్తకాయ చిన్నది	రూ.4

తెగుళ్లతో నష్టం



నల్లిపురుగు, తెల్లదోమ తెగులు వల్ల పంట తీవ్రంగా నష్టపోయింది. దీంతో కాయ పరిమాణం, దిగుబడులు తగ్గాయి. మన కాయలు కన్నా తమిళనాడు, కేరళలో పంట నాణ్యతా ప్రమాణాలు ఉండటంతో వాటికి డిమాండ్ బాగుంది. మన రాష్ట్రంలో కొబ్బరికి డిమాండ్ పెరగాలంటే కాయలకు మచ్చలేకుండా ఉండాలి. ప్రభుత్వం పరిశోధనా కేంద్రాల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. కురిడీ కొబ్బరి నిల్వ కేంద్రాలను ఏర్పాటుచేయాలి.

–కోట శేషుబాబు, పాలకొల్లు కోకోనట్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు

దింపు తీయాలంటే భయం



వచ్చేవన్నీ పండుగ రోజులే కదా అని ఆశపడ్డాం. అయితే తమిళనాడు, కేరళలో పంటలు గుదిబండలా మారాయి. ఇక్కడ కాయలు దింపు తీయించాలంటే కూడా భయమేస్తుంది. దింపునకు కాయకు రూ.3 వరకు ఖర్చవుతోంది. వ్యాపారులు కాయకే రూ.4, రూ.6 ఇస్తామంటున్నారు. దీంతో వెనుకాడుతున్నాం. మచ్చలు ఉంటే ఏ వ్యాపారి కొనుగోలు చేయడం లేదు. కొబ్బరి రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఆరు నెలల నుంచి ఇదే పరిస్థితి.

– దొడ్డా శ్రీనివాసరావు, కొబ్బరి రైతు, వరిధనం, పాలకొల్లు మండలం

సీఎం జగన్ పాలనలో సంతోషంగా ప్రజలు

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని ఎల్.అగ్రహారంలో గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. సీఎం జగన్ పాలనను కొనసాగించేందుకు రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. పురాణాలు, ఇతిహాసాల్లో దేవతలు, రాక్షసుల గురించి విన్నామని, రాక్షస మనస్తత్వం కలిగిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో పేదలను ధనవంతులు చేస్తానని చంద్రబాబు నమ్మబలుకుతున్నాడని, ఏం చెప్పినా ప్రజలు నమ్ముతారనే భ్రమల్లో ఉన్నాడని దుయ్యబట్టారు. చంద్రబాబు మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడని మండిపడ్డారు. కాపు సామాజికవర్గానికి చెందిన పెద్దలు, యువకుల ఓట్లను చంద్రబాబుకు వేయించి జగన్‌ను ఓడించాలని పవన్ కల్యాణ్ చూస్తున్నాడని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నాడని, పిట్టలదొర మాదిరిగా కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాడన్నారు. ఇటువంటి వ్యక్తి మాటలు నమ్మవద్దని ప్రజలకు హితవు పలికారు. 2019 ఎన్నికల్లో ఓడించినా బుద్ధి రాలేదని, రానున్న ఎన్నికల్లో చంద్రబాబును శాశ్వతంగా రాజకీయాలకు దూరం పెట్టాలని పిలుపునిచ్చారు.



ఎల్.అగ్రహారంలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపీడీఓ ఎం.విశ్వనాథ్, పీఆర్ డీఈ వీఎస్.వేణుగోపాల్, ఏపీఎం జీవీకేడీఎం లక్ష్మి, హౌసింగ్ ఏఈ వైవీ వెంకట్రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడేరు వంతెనపై ట్రయల్‌రన్

- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చొరవ
- త్వరలో అధికారికంగా ప్రారంభం

సాక్షి, భీమవరం: తాడేరు వంతెన నిర్మాణానికి సంబంధించి భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. వంతెన నిర్మాణ పనులకు ఈ ఏడాది ఏప్రిల్ 4న శంకుస్థాపన జరగ్గా నాలుగు నెలల వ్యవధిలోనే పనులను పూర్తిచేయించి ఆదివారం ట్రయల్‌రన్‌ను ప్రారంభించారు. గతంలో తాడేరు వంతెనను 1929లో నిర్మించగా పదేళ్ల క్రితం శిథిలావస్థకు చేరింది. వంతెన పునరుద్ధరణను గత పాలకులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో 2019లో రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన గ్రంధి శ్రీనివాస్ నూతన వంతెన నిర్మాణానికి తొలుత రూ.1.90 కోట్లు నిధులు మంజూరు చేయించారు. దాదాపు తొమ్మిదిసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అంచనాలు పెంచి రూ.2.30 కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో పనులను వేగంగా పూర్తిచేయించి వంతెన నిర్మాణాన్ని ఎమ్మెల్యే గ్రంధి పూర్తిచేయించారు. పది రోజులపాటు ట్రయల్‌రన్ నిర్వహించి త్వరలో అధికారికంగా వంతెనను ప్రారంభించనున్నారు. ఆదివారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వంతెనను పరిశీలించారు. నామన మహేష్, మానేపల్లి నాగన్నబాబు, కొట్టి కుటుంబరావు, కోమటి రాంబాబు ఆయన వెంట ఉన్నారు.



తాడేరు వంతెనను పరిశీలిస్తున్న భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

గ్రామ స్వరాజ్యమే ప్రభుత్వ లక్ష్యం



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎంపీ శ్రీధర్. చిత్రంలో ఎమ్మెల్యే వాసుబాబు

ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేసి పాలనను ప్రజల ముంగిటికి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గణపవరంలో సుమారు రూ.2.50 కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రాల భవనాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కోటగిరి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పాలనను ప్రజలకు చేరువచేసిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని, స్థానికంగానే ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. అలాగే రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు, ప్రజారోగ్యం కోసం విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటుచేస్తోందన్నారు. ఇంతటి సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలని ఆయన కోరారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పథకాలన్నీ పారదర్శకంగా నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా సీఎం జగన్ దృష్టి సారించారని, నాడు–నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేసిన పాఠశాలలు, నూతన సచివాలయాలు, ఆర్‌బీకేలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలతో గ్రామాలు కళకళలాడుతున్నాయన్నారు. రానున్న మూడు నెలల్లో రహదారులన్నీ కొత్తరూపును సంతరించుకోనున్నాయన్నారు. తొలుత రూ. 87.20 లక్షలతో నిర్మించిన గణపవరం గ్రామ సచివాలయం–3, గ్రామ సచివాలయం–4 భవనాలు, సచివాలయం–2 పరిధిలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్ర భవనాలకు ప్రారంభించారు. అలాగే సచివాలయం–4 పరిధిలో రూ.23.94 లక్షలతో, సచివాలయం–1 పరిధిలో రూ.23.94 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే భవనాలను వారు ప్రారంభించారు. సూర్యబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి నడింపల్లి సోమరాజు, తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఎంపీడీఓ జ్యోతిర్మయి, సర్పంచ్ మూర అలంకారం, ఎంపీటీసీ సభ్యులు దండు రవి, బత్తి సీతామహాలక్ష్మి, మండల ఉపాధ్యక్షురాలు సలాది రత్నకుమారి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు గాదిరాజు అబ్బాస్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ఏలూరు (టూటౌన్): తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరులోని వైఎంహెచ్ఏ హాల్‌లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆవృత్తాల వారీగా కవులు కవితా గానం చేశారు. అనంతరం కవులను నిర్వాహకులు సత్కరించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఏలూరు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా పార్కులో ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి పూజాదికాలు నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా కమిటీ, యూత్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. ముఖ్య అతిథు రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తెలుగు భాష ఔన్నత్యం కోసం శ్రీశ్రీ కళావేదిక చేపడుతున్న కార్యక్రమాలకు అత్యంత ఆదరణ లభించడం భాషాభిమానానికి నిదర్శనమన్నారు. ర్యాలీలో భాగంగా శ్రీ నలంద పాఠశాల విద్యార్థుల కోలాట ప్రదర్శనలు, తెలుగు తల్లి వేషధారణలు ఆకట్టుకున్నాయి. శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ సమన్వయకర్త, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ నాయకులు చిట్టే లలిత, కట్ల భాగ్యలక్ష్మి, జి.ఈశ్వరీ భూషణం, తణుకు రుషి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీహరి కోటి, గౌరవ సలహాదారు లేళ్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు శొంఠియాల కస్తూరిరావు, జిల్లా కన్వీనర్ జి.కృష్ణమనోహర్, కో–కన్వీనర్ ఎంజే సుజయ్ కృష్ణ, పెద్దసంఖ్యలో కవులు పాల్గొన్నారు.



ఏలూరులో ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

'మహోన్నత భాష'కు సత్కారం

పెదవేగి: మహోన్నత భాష నా తెలుగు భాష అని చాటిచెప్పిన విజ్ఞాన్ వరల్డ్ వన్ ఉపాధ్యాయుడిని అంతర్జాతీయ సాహిత్య సంస్థ సత్కరించింది. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 123వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు చొదిమెళ్ల రవికుమార్ 'మహోన్నత భాష నా తెలుగు భాష' అనే కవితను వినిపించి ఆకట్టుకున్నారు. శ్రీశ్రీకళావేదిక నిర్వాహకులు ఆయన్ను మెమెంటో, ప్రశంసాపత్రంతో సత్కరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ నాగసురేష్ ఆయన్ను అభినందించారు.



వీరమ్మకుంటలో ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ

పారదర్శకంగా ఓటర్ల జాబితా

పెదపాడు: ఓటర్ల జాబితా తయారీలో పారదర్శకత ఉండాలని డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బూత్‌స్థాయి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ల నమోదు, తొలగింపు, బదిలీ వంటి వాటి వివరాలు తెలుసుకుని చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం వీరమ్మకుంట గ్రామంలో బీఎల్‌ఓలు ఓటర్ల జాబితా సర్వే చేసిన విధానాన్ని పరిశీలించారు. ఓటర్ల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరణించిన వారి ఓట్లకు సంబంధించి కుటుంబసభ్యులతో దరఖాస్తు చేయించి వాటిని తొలగించాలన్నారు. తహసీల్దార్ వి.విజయ్‌కుమార్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీడీవీ ప్రసాద్ బాబు, ఏఎస్ఓ ఆదినారాయణ, గ్రామ రెవెన్యూ అధికారులు బెవర కోటేశ్వరరావు, ఎ.నర్సింహా ఆయన వెంట ఉన్నారు.

క్లుప్తంగా

కాళ్లకూరు వెంకన్నకు ఊంజల్ సేవ



ప్రత్యేక దీపాలంకరణలో స్వామి అమ్మ వార్లు

కాళ్ల: కాళ్ల మండలం కాళ్లకూరులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి శ్రీ స్వామి, అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన ఊంజల్ సేవ (డోలోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ధర్మకర్తల మండలి అధ్యక్షుడు దండు వెంకటకృష్ణంరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మంగమ్మ తల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ తల్లిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గత రెండు రోజులుగా ఈ ప్రాంతంలో ఏదో సమయంలో వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులను మంగమ్మతల్లి దర్శనానికి ఆలయ కమిటీ వారు అనుమతి ఇచ్చారు. దీనితో పెద్ద ఎత్తున తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ప్రైవేటు బస్సులు, మినీ వ్యాన్‌లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలలో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

చురుగ్గా విద్యుత్ మీటర్లకు ఆధార్ సీడింగ్

- ఇప్పటికే 50 శాతం సీడింగ్ ప్రక్రియ పూర్తి
- ఉమ్మడి జిల్లాలో 15.81 లక్షల విద్యుత్ కనెక్షన్లు

సాక్షి, భీమవరం: విద్యుత్ మీటర్లకు ఆధార్ సీడింగ్ ప్రక్రియ పశ్చిమగోదావరి జిల్లాలో చురుగ్గా సాగుతోంది. విద్యుత్ మీటర్లకు ఆధార్ లింక్ చేయడం ద్వారా బిల్లుల విషయంలో సమస్యలతో సతమతమయ్యే వినియోగదారులకు ఊరట కలగనుంది. పట్టణాలు, గ్రామాల్లో కుటుంబసభ్యులు, బంధువుల విద్యుత్ మీటర్లను మరొకరు వినియోగించుకోవడం పరిపాటి. అలాగే ఒకరి ఇంటిలో మరొకరు నివాసం ఉండడం జరుగుతోంది. ఎంతోకాలం నుంచి విద్యుత్ మీటర్లను వినియోగిస్తున్నా బిల్లులు మాత్రం మీటరుకు దరఖాస్తు చేసిన వారి పేరునే ఉంటున్నాయి. దీంతో విద్యుత్ బిల్లుల రీడింగ్ తీసే సమయంలోను, బిల్లుల చెల్లించేటపుడు అసలు వినియోగదారుడికి గాకుండా గతంలో మీటరు కోసం దరఖాస్తు చేసిన వారికే ఫోన్ మెసెజ్‌లు వెళుతున్నాయి. దీంతో వినియోగదారులు అనేక అనేక ఇబ్బందులు పడుతున్నారు.



మీటరు యజమాని ఫోన్‌కే మెసేజ్‌లు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గృహవినియోగం, వ్యవసాయం, పరిశ్రమలు వంటి వాటికి సుమారు 15,81,988 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటన్నింటికీ విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ మీటర్లను ఆధార్‌కు అనుసంధానం చేసే చర్యలు చేపట్టారు. ఒక్కొక్క ఇంటికి లేదా షాపునకు రెండు లేదా మూడు విద్యుత్ కనెక్షన్లు ఉన్నా వారి ఇంటిలోని సభ్యుల పేరునే ఆధార్ అనుసంధానం చేస్తారు. దీనివల్ల విద్యుత్ బిల్లులు, బిల్లులు చెల్లించిన రశీదులు మీటరు యజమాని సెల్‌ఫోన్‌కు మాత్రమే మెసేజ్ వస్తుంది. దీని ద్వారా బిల్లు ఎప్పుడు చెల్లించాలి, సక్రమంగా చెల్లించింది లేనిది తెలుస్తుంది. భీమవరం డివిజన్‌లో 2,10,133, ఏలూరులో 3,54,323, జంగారెడ్డిగూడెంలో 2,32,825, నరసాపురంలో 2,64,619, తాడేపల్లిగూడెంలో 2,42,715, నిడదవోలు డివిజన్‌లో 2,77,373 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ కార్యక్రమం వేగంగా నిర్వహిస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా 50 శాతం వరకు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

వినియోగదారులు సహకరించాలి



విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ఆధార్ అనుసంధానం ప్రక్రియ వేగంగా జరుగుతోంది. విద్యుత్ బిల్లులు వంటి వాటి విషయంలో వినియోగదారులకు సమాచారం ఇవ్వడానికి ఆధార్ అనుసంధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆధార్ సీడింగ్ వేగంగా పూర్తి చేయడానికి విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలి.

– పీర్ అహ్మద్‌ఖాన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, విద్యుత్ శాఖ, భీమవరం

గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్.అగ్రహారంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

డెంగీ లక్షణాలతో మహిళ మృతి

పోడూరు: మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ఈతకోట చంటమ్మ(42) డెంగీ లక్షణాలతో మృతిచెందింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చంటమ్మకు కొద్దిరోజుల క్రితం జ్వరం రావడంతో ఆమె భర్త శ్రీనివాసరావు పెనుగొండలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అక్కడ నిర్వహించిన రక్త పరీక్షల్లో డెంగీ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆమెను ఈ నెల 22న సాయంత్రం భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ పరీక్షలు నిర్వహించగా ఆమెకు రక్తకణాలు బాగా తగ్గిపోవడంతో పాటు కామెర్లు, ఊపిరితిత్తుల్లో నిమ్ము ఉన్నట్లు గుర్తించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. చంటమ్మ భర్త శ్రీనివాసరావు వెల్డింగ్ పని చేస్తాడు. వీరికి ఇద్దరు కుమారులు.. చంటమ్మ వైద్యానికి దాదాపు రూ.2 లక్షలు ఖర్చు చేసినా ఆమెను కాపాడుకోలేకపోయామని, తన ఇద్దరు పిల్లలు టైఫాయిడ్‌తో బాధపడుతున్నారని భర్త శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.



ఈతకోట చంటమ్మ, మృతురాలు (ఫైల్)

ఆర్యవైశ్య యువజన సంఘాల సమాఖ్య ప్రమాణ స్వీకారం

భీమవరం ప్రకాశం చౌక్: ఆర్యవైశ్య యువజన సంఘాల సమాఖ్య ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం భీమవరంలో నిర్వహించారు. సభాధ్యక్షుడిగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఆంధ్ర ప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బ చంద్రశేఖర్, మహాసభ మాజీ అధ్యక్షుడు వబిలిశెట్టి కనక రాజు, మహాసభ కార్యదర్శి సాధు ప్రతాప్ పాల్గొన్నారు. సమాఖ్య అధ్యక్షుడిగా కొనగల హరినాథ్, కార్యదర్శిగా దివేల రామకృష్ణ, కోశాధికారిగా యల్లంపల్లి ప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా గమిని పవన్‌కుమార్, కార్యదర్శిగా పరిపాటి శ్రీను, కోశాధికారిగా చిర్లంచర్ల శ్రీకాంత్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్య సంఘ భవనం అధ్యక్షుడు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, పరుచూరి నాగేశ్వరరావు, కురిసేటి రమేష్, ఓలేటి శ్రీనివాస్ గుప్తా తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన ఇంటిపేరు గ్రంధి కావడంతో ఇతర ప్రాంతాల్లోని వారు తనను ఆర్యవైశ్యుడిగా భావిస్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఆర్యవైశ్యులకు తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని, జీఎంఆర్ అంటే చాలామంది తమనే అనుకుంటారని తెలిపారు. ఆర్యవైశ్య యువత నేడు అన్ని రంగాలలోనూ ముందుందని, ముఖ్యంగా వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక రంగాలలో తమ సత్తా చాటుతుందని ప్రశంసించారు. దేశం ఎదుగుదలలో ఆర్యవైశ్యుల పాత్ర చాలా కీలకమని అన్నారు. అనంతరం నూతన కమిటీలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మానేపల్లి నాగన్న బాబు, ఏవీఆర్ సభాపతి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తదితరులు

మున్సిపల్ వర్కర్స్ సభలు జయప్రదం చేయాలి

చింతలపూడి: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలు ఈ నెల 30, 31 తేదీలలో ఏలూరు నగరంలో జరుగుతుందని దీనిని జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ చింతలపూడి గౌరవ అధ్యక్షుడు తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో చింతలపూడి మున్సిపల్ వర్కర్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 52,000 మందికి పైగా పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, ప్రజారోగ్యంలో వీరి పాత్ర కీలకమైనది అన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని, యూనిఫాం, సబ్బులు, చెప్పులు, కొబ్బరి నూనె ఇవ్వాలని వీటితోపాటు స్థానిక మున్సిపాలిటీలో ఉన్న సమస్యలను గుర్తించి మహాసభలో ఒక కార్యచరణ రూపొందించుకొని అవి సాధించే వరకు పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కార్మికులు వెలగాడి అనురాధ, సందీపం, చిన్నన్న, బి.నారాయణ, బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భర్తపై వరకట్న వేధింపుల కేసు నమోదు

భీమవరం అర్బన్: అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం నరసాపురం మండలంలోని గొంది గ్రామానికి చెందిన అంగాని శ్యామ్‌కుమారికి నాగేంద్రపురం గ్రామానికి చెందిన అంగాని లక్ష్మణస్వామితో 2014లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివాహ సమయంలో శ్యామ్‌కుమారి తల్లిదండ్రులు కొంతసొమ్మును ముట్టచెప్పారు. ఇటీవల అదనపు కట్నం తీసుకురమ్మని లక్ష్మణస్వామి తన భార్యను వేధిస్తుండటంతో ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవత సేవలు అభినందనీయం

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: మానవత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక, వైద్య సేవలు పలువురికి స్ఫూర్తిదాయకమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాజవల్లి రాధారమణ్ లయన్స్ కంటి ఆసుపత్రిలో ఉచిత గుండె, ఊపిరితిత్తుల వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డా.పీవీ సురేష్‌కుమార్, డా. ఎం.మాధవరావు, డా.పైడి అనిరుధ్ కుమార్, డా.ఎస్.వెంకటరెడ్డి తదితరులు పాల్గొని రోగులను పరీక్షించి ఉచిత వైద్య సలహాలు అందజేశారు. శిబిరంలో 285 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు యడ్ల తాతాజీ, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ ఎస్.పాపారావు నాయుడు, మానవత అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, కార్యదర్శి పీఎస్ ప్రతాపరాజు, కోశాధికారి మద్దాల వాసు, మేడికొండ శ్రీనివాస చౌదరి, ముత్యాల రామారావు, క్యాంపు కోఆర్డినేటర్లు మేడికొండ రామదాసు, బొక్కా రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు(గోపి)

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

పాలకోడేరు: పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామంలో తెగిపడిన హై టెన్షన్ విద్యుత్ వైర్ తగిలి పాలకొల్లుకు చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి సఖినేటిపల్లి సత్యనారాయణ(70) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు సత్యనారాయణ తన ఖాళీ స్థలంలో మొక్కలు శుభ్రం చేస్తున్న సమయంలో తెగిఉన్న వైరు తగలడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడు సత్యనారాయణకు భార్య రమావతి, కుమారుడు, కుమార్తె వున్నారు. ఈ ప్రాంతంలో విద్యుత్ వైర్లు తెగిపడుతూ ఉంటున్నాయని ట్రాన్స్‌కో అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కత్తితో ముసుగు వ్యక్తి హల్‌చల్

సాక్షి, భీమవరం: ముసుగు ధరించిన వ్యక్తి పట్టణంలో కత్తితో కలకలం సృష్టించాడు. భీమవరం రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ బహుళ అంతస్తు భవనం దగ్గర అపరిచిత వ్యక్తి కత్తితో హల్‌చల్ చేసిన దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీలో గుర్తించారు. అపార్టుమెంట్ వద్దకు శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ వ్యక్తి టోపీ, ముఖానికి ముసుగు ధరించిన వ్యక్తి కత్తిపట్టుకుని గోడదూకి వచ్చాడు. అపార్టుమెంటు కాపలాదారుడి గదికి బయట గొళ్లెం పెట్టాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో వాచ్‌మెన్ తలుపు తీసి బయటకు వద్దామనుకుంటే గొళ్లెం పెట్టి ఉంది. దీంతో పక్కన ఉంటున్న మరో వ్యక్తికి ఫోన్ చేయగా ఆ వ్యక్తి వచ్చి గొళ్లెం తీశాడు. తనను లోపల ఉంచి ఎవరో గొళ్లెం పెట్టారని సంబంధిత అపార్టుమెంటులోని వారికి తెలియజేశాడు. సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలిస్తే ఈ దృశ్యాలన్నీ కనిపించాయి. అపరిచితుడు గోడలు దూకుతూ మరో భవనం నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని రెండో పట్టణ పోలీసులకు తెలపడంతో ఎస్సై పి.అప్పారావు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు.

శ్రీవారి ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత వెంకటశాస్త్రికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ లక్ష్మణ స్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలికి చెందిన దేవరకొండ వేంకట శాస్త్రి ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ ఏఈఓ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

వినయ్ రామ్‌కి పురస్కారం




సింగపూర్‌లో పురస్కారం అందుకుంటున్న వినయ్ రామ్

కొయ్యలగూడెం: ఈకో ప్రొడ్యూస్ ఆఫ్ ద ఇయర్ అవార్డుతో యూఏఈ ప్రతినిధులు తనకు పురస్కారం అందజేసినట్లు డాక్టర్ నిడదవోలు వినయ్ రామ్ పేర్కొన్నారు. సింగపూర్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల సదస్సులో ఒమన్, దుబాయ్ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారని.. ఈ సందర్భంగా టెక్నో క్రాఫ్టేస్ అంశంపై సెమినార్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. గతించిపోయిన వరి వంగడాల అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు పురస్కారం అందజేశారన్నారు. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన వినయ్ రామ్ హైదరాబాదులో స్థిరపడి ది ప్లానెట్ గ్రీన్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా అంతరించిపోతున్న 127 రకాల వరి ధాన్యాల ఉత్పత్తికి కృషి చేస్తున్నారు.

తెలుగు నటులకు ఆస్కార్ సాధ్యమే

నిర్మాత కరాటం రాంబాబు

కొయ్యలగూడెం: తెలుగు చలనచిత్ర నటులకు ఆస్కార్ అవార్డు దక్కే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలుగు చలన చిత్ర నిర్మాత, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ ఉత్తమ నటుడు అవార్డు సాధించినందుకు అల్లు అర్జున్‌ను ఫోన్ లో అభినందించినట్లు తెలిపారు. పుష్ప సినిమాను అగ్ర నిర్మాత అల్లు అరవింద్‌తో కలిసి వీక్షించానని ఆ సమయంలో అల్లు అర్జున్ నటనకు జాతీయస్థాయిలో గుర్తింపు వస్తుందని అరవింద్‌తో పేర్కొన్నట్లు తెలిపారు. యువ నటులతో తెలుగు చలనచిత్ర పరిశ్రమ కొత్త పుంతలు తొక్కుతుందని ప్రపంచంలోనే చలనచిత్ర రంగానికి కోహినూరుగా భావించే ఆస్కార్ పురస్కారం అందుకోగల సత్తా ప్రస్తుత మన యువ నటులకు ఉందని ఆయన పేర్కొన్నారు.



కరాటం రాంబాబు, సినీ నిర్మాత

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విరాళం

తణుకు టౌన్: తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం కళాశాల పూర్వ విద్యార్థి, ప్రవాస భారతీయుడు, అమెరికాలోని ఓహాయో విశ్వవిద్యాయం ప్రొఫెసర్ డాక్టర్ కామర్సు వాణీనాథరావు 100 ప్యాడ్ ఫోల్డింగ్ కుర్చీలను బహూకరించారు. ఆదివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాలకు ఈ కుర్చీలను అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన డాక్టర్ కే వాణీనాథరావు 1972–76 మధ్య ఈ కళాశాలలో బీఎస్సీ డిగ్రీ చదివారు. అమెరికాలోని వారి సంస్థ ఇండియన్ నెట్ వర్క్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు అవసరమైన రూ.3 లక్షల విలువైన ప్యాడ్ ఫోల్డింగ్ కుర్చీలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కే బాలకృష్ణ, కే రవి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఏ మారుతీదేవి చౌదరి, అధ్యాపకులు భూపాల్, కే ఫణిదర్, సీహెచ్ దేవి, జీ విజయకుమార్, వీ శివప్రకాష్ తదితరులు దాత వాణీనాథరావును సత్కరించారు.



దాత డాక్టర్ కే వాణీనాథరావును సత్కరిస్తున్న కళాశాల అధ్యాపక సిబ్బంది

మెట్టలో విస్తారంగా మిర్చి సాగు

లింగపాలెం: మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలంలో ఈ ఏడాది మిర్చి సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. మిర్చి పండించటంలో జిల్లాలోనే లింగపాలెం మండలం ప్రసిద్ధి చెందింది. మండలంలో గతేడాది తెగుళ్లు, పురుగులు సోకి మిర్చి తోటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు భారీగా నష్టపోయారు. మిర్చిపంటకు గిట్టుబాటు ధర ఉన్నప్పటికి తోటలు దెబ్బతినడంతో ప్రయోజనం లేకపోయింది. ఈ ఏడాది కూడా రైతులు మిర్చిపంటకే మొగ్గుచూపారు. మిర్చి నారు తోటలు వేస్తున్నారు. ఈ మండలంలోని రైతులే కాకుండా ఇతర మండలాలు, జిల్లాల నుంచి రైతులు ఇక్కడకు వచ్చి మిర్చి నారు కొనుగోలు చేస్తారు. ఎకరం మిర్చి సాగుకు 9 వేల నుంచి 10 వేల వరకు మిర్చి మొక్కలు వేస్తారు. ఒక్కో మొక్క రూపాయి నుంచి రూ 1.50 ఉంటుంది. మండలంలో ప్రతి ఏట సుమారు 3 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు రెండు వేల ఎకరాల్లో మిర్చిసాగు చేయనున్నట్లు అధికారుల అంచనా. ఒక్క ధర్మాజీగూడెంలోనే సుమారు 196 ఎకరాల్లో పంటను సాగుచేస్తారు. ఇక్కడ పండించిన మిర్చి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఎకరా మిర్చి సాగుకు రూ.1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టాలి. ఈసారి 22, 855, కీర్తి తేజ, ఎస్ఎస్ వంటి రకాలను వేశారు. మిర్చి మొక్క నాటిన 90 రోజులకు కాపుకు వస్తుంది. కొంతమంది పచ్చికాయ కోసి అమ్మకాలు చేస్తే మరికొందరు ఎండిమిర్చికి ఉంచుతారు. 60 కేజీల బస్తా అప్పటి రేట్లను బట్టి రూ.900 నుంచి రూ.1,200 వరకు ధర ఉంటుంది. వాతావరణం పరిస్థితులు అనుకూలించి, తెగుళ్ల ఆశించకుండా మార్కెట్ కలిసొస్తే ఫలితం ఉంటుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం ఎండిమిర్చి క్వింటా ధర రూ.18,000 వరకూ ఉంది.



లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో తోటలు వేసేందుకు సిద్ధంగా ఉన్న మిర్చినారు

గిట్టుబాటు ధర కల్పించడం లాభదాయకం



ప్రభుత్వం మిర్చికి గిట్టుబాటు ధర కల్పించడం మంచి పరిణామం. గత ఏడాది మిర్చి తోటలకు తెగుళ్లు, తామర పురుగు, నల్లి వంటివి ఆశించడంతో తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మిర్చి పంటను సాగుచేసేందుకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెడుతున్నాం. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించినా దిగుబడి లేక నష్టపోతున్నాం.

ఉప్పు మధుసూదనరావు, రైతు, ధర్మాజీగూడెం

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2378]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-788211]

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థ లలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్. సంప్ర॥ ✆ 99481 66555 [B-1193230]

BUSINESS OFFER

■ Sipra కంపెనీ ప్రొవైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను. మంచి జీతం+కమీషన్. Cell: 9990752820. [T-1225444]

Wanted

■ ఏలూరు – సత్రంపాడు సాఫ్ట్ డ్రింక్స్ కంపెనీ నందు పనిచేయుటకు Tata ace driver కావలెను. సాలరీ :15000/– సెల్ : 95029 22699. [P-1233422]

■ బిషలరి వాటర్ ఏజన్సీ భీమవరంలో పనిచేయుటకు TATA Ace లకి డ్రైవర్స్, సేల్స్‌మెన్స్ కావలెను. భీమవరం సంప్రదించండి: 99482 31707. [P-45]

■ భీమవరంలో సెక్యూరిటీ గార్డులు–25 కావలెను 8గం. డ్యూటీ, వీక్లీ ఆఫ్, జీతం: 12,000/– PF & ESI & సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ (5 సం. Exp.) 7గురు కావలెను. జీ: 15,000 ✆ 9550989842. [B-1206614]

■ హరేకృష్ణ హోంకేర్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/కావలెను. ఫ్రీ వసతి+భోజనం.జీ:18K. హైదరాబాద్ ఫోన్: 9640258899, విజయవాడ:9640648899 [H-189325]

■ కష్టలైప్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/-, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph: 7993583999 [HA-543]

■ జాబ్ గ్యారంటీ 18-50సం॥ల మహిళలు, పురుషులు అర్జెంటుగా కావలెను. ఫ్రీ రూం+భోజనం, జీతం: 25000/-వేల వరకు. ఫోన్ : 9346605007 [HA-10956]

■ Now Hiring Sales Staff, SRI Mahalaxmi Jewellers & Pearls, Jubilee Hills, Hyderabad. Join our Prestigious group for growth. Male Candidates only. Execullent pay. Ph: 9000703311, 9100112221, 9441436385. [HA-11739]

■ మా సంస్థ యందు 8 మెగావాట్స్ టర్బైన్ నందు పనిచేయుటకు 5 సంవత్సరాలు పైబడిన అనుభవం కలిగిన ఆపరేటర్లు కావలెను. అనుభవాన్ని బట్టి తగిన జీతం నవభారత్ లిమిటెడ్ జంగారెడ్డిగూడెం. సంప్రదించండి : 83329 95489, mail id: hr@nbl.in, hr1 @nbl.in [P-49]

సినిమా వార్తల కోసం లాగ్ఆన్ అవ్వండి www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

కృష్ణ మందిరంలో పూజలు

తాడేపల్లిగూడెం: శ్రావణమాస శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమాత్మునికి పంచామృతాభిషేకం , సహస్రనామార్చనలు ఆలయ అర్చకులు మంగిపూడి సీతారామయ్య పర్యవేక్షణలో నిర్వహించారు. మందిర కార్యదర్శి మోహనరాజు, భక్తులు పాల్గొన్నారు.

నేడు పెదఅమిరంలో గడపగడపకు మన ప్రభుత్వం

కాళ్ల: పెదఅమిరం గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆదివారం చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని కోరారు.

లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి విశేషాలంకరణ

పాలకొల్లు అర్బన్: ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని వాలమర్రులో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివార్లకు ఆదివారం విశేషాలంకరణ చేశారు. అభిషేకాలు, అష్టదళ పాద పద్మారాధన పూజలు నిర్వహించారు. అర్చక స్వామి పెద్దింటి మణికిరణ్ బ్రహ్మత్వంలో భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కేపీ పాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి



బీచ్‌లో సేదతీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలి వచ్చారు. ఉదయం నుంచి ఆకాశంలో చల్లని మబ్బులతో వాతావరణం అహ్లాదకరంగా ఉండటంతో పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వరస్వామి, పాండురంగ స్వామి, అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను సందర్శించారు.

ఓట్లు సరిచూసుకోవాలి

యలమంచిలి: ఓట్ల సర్వే పూర్తయిన నేపథ్యంలో ప్రతి సచివాలయం వద్ద ఓటర్ల జాబితా ఉంచామని, ప్రతి ఒక్కరూ ఆ జాబితాలో తమ పేరు ఉందో లేదో నిర్ధారించుకోవాలని పాలకొల్లు అసెంబ్లీ ఎలక్షన్ క్లెయిమ్స్ వెరిఫికేషన్ ఆఫీసర్, డీసీఓ ఎం.రవికుమార్ కోరారు. ఓట్లు ఫీల్డ్ వెరిఫికేషన్‌లో భాగంగా ఆదివారం ఆయన యలమంచిలిలో పర్యటించారు. ర్యాపిడ్‌గా ఇళ్లకు వెళ్లి ఓటర్ల జాబితా తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటుకు నమోదు చేసుకోవడంతో పాటు తుది జాబితాలో తమ పేరు ఉందో లేదో సరిచూసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట తహసీల్దార్ మాతా సునీల్ కుమార్, గ్రామ కార్యదర్శి పాలా శారదా శ్రీనివాస్, వీఆర్వో గోటేటి లక్ష్మీ నరసింహారావు (బుజ్జి) తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ తీరుపై సంతకాల సేకరణ

నరసాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరుద్యోగం, విద్యుత్ చార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా ఆదివారం నరసాపురం 24వ వార్డులో సీపీఎం ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కమిటీ సభ్యుడు పొగాకు నారాయణరావు మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోదీ ప్రభుత్వం ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోందన్నారు. కార్యక్రమంలో అప్పల నాయుడు, టంకాని నారాయణరావు, గంగులూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఎస్సై బి.మోహన్‌రావు తన సిబ్బందితో కొవ్వాడ అన్నవరం గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.2,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు

పాలకోడేరు: పాలకోడేరు పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక ఏఎస్‌ఆర్ నగర్‌కు చెందిన యువకుడు గండికోట దేవరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును వెనుక భాగంలో ద్విచక్రవాహనంతో బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. తలకు తీవ్ర గాయామై రక్తస్రావం జరగడంతో స్థానికులు 108 వాహనంలో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సులువైన బోధనకు స్మార్ట్ స్క్రీన్లు

- ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి..
- స్వాగతిస్తున్న విద్యార్థులు



తణుకు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పీ ద్వారా పాఠాన్ని బోధిస్తున్న ఉపాధ్యాయుడు

తణుకు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యాంశాల బోధన మరింత సులువు చేసే క్రమంలో ప్రభుత్వం నూతన విధానాలను, వాటికి సంబంధించిన మౌలిక వసతులను పాఠశాలలకు కల్పిస్తోంది. ప్రైవేటు పాఠశాలల్లో సైతం లేని డిజిటల్ సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇందులో భాగంగా విద్యా విధానంలో విద్యార్థులకు డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఇంట్రాక్షన్ ఫ్లాట్ పానల్ (ఐఎఫ్‌పీ) స్మార్ట్ స్క్రీన్‌లు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ స్మార్ట్ స్క్రీన్‌ల ద్వారా అంతర్జాలంలో పొందుపర్చిన వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన అంశాలను ఉపాధ్యాయులు సులువుగా అర్థమయ్యే రీతిలో ప్రయోగాత్మకంగా విద్యార్థులకు బోధిస్తున్నారు. వీటిని మొబైల్ ద్వారా యాక్టివేట్ చేయడం, పెన్‌డ్రైవ్‌లు, ఇంటర్నెట్ ద్వారా మూడు పద్ధతుల్లో వినియోగిస్తున్నారు. అంతేకాక వైట్ బోర్డులా కూడా ఈ స్మార్ట్ స్క్రీన్‌లను ప్రత్యేకమైన స్టిక్ ద్వారా వినియోగించే అవకాశం కూడా ఉంది. దీని కోసం ఇప్పటికే విద్యాశాఖ ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో శిక్షణను ఇప్పించింది ప్రభుత్వం.

తరగతి గదికి ఒక స్క్రీన్ ఏర్పాటు

రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి వచ్చిన ఈ స్మార్ట్ స్క్రీన్‌లు తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాలిటీ, తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకివచ్చాయి. తరగతి గదికి ఒకటి చొప్పున ఈ స్క్రీన్‌లు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయుడు ఈ స్క్రీన్‌పై బోధించిన అంశాన్ని చెరిపేయకుండా సేవ్ చేసుకునే సౌకర్యం ఇందులో పొందుపర్చారు. అంతేకాక మ్యాథమెటిక్స్‌కు సంబంధించి వృత్తాలు, కోణాలు, త్రికోణాలు వంటి అంశాలు సులువుగా బోధించవచ్చని, యూట్యూబ్‌లో పొందుపర్చిన బోధనాంశాలు కూడా విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నాయి. యాండ్రాయిడ్ బాక్స్‌ద్వారా బైజూస్‌కు కనెక్ట్ అవ్వవచ్చని, మానవ శరీరంలోఉన్న అవయవాలను లైవ్‌గా చూపించే సౌకర్యంకూడా ఈ స్క్రీన్‌లలో పొందుపర్చి ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. 65 అంగుళాల నిడివితో ఉండే ఈ స్క్రీన్ ఒక్కొక్కటి రూ.1.30 లక్షలు విలువైనదిగా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

సులువుగా అర్థమవుతోంది



డిజిటల్ విద్యా విధానాన్ని విద్యార్థులకు చేరువ చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన ఐఎఫ్‌పీ స్మార్ట్ స్క్రీన్‌లు విద్యార్థులకు చాలా బాగా ఉపయోగపడుతున్నాయి. పాఠ్యాంశంలోని విషయ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు బోధించడం ఉపాధ్యాయులకు సులువుగా ఉంది. ఈ స్మార్ట్ స్క్రీన్‌లపై ఉపాధ్యాయులు చేసే బోధనా విధానాన్ని విద్యార్థులు కూడా ఆకళింపు చేసుకుంటున్నారు.

– కందుకూరి పద్మావతి, ప్రధానోపాధ్యాయిని, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, తణుకు.

డిజిటల్ విద్యా విధానం బావుంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి తీసుకువచ్చిన స్మార్ట్ స్క్రీన్‌లు మాకు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి. డిజిటల్ విద్యా విధానంలో ఈ స్క్రీన్‌లు ప్రతి పాఠశాలలోనూ కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. ఉపాధ్యాయులు బోధించే ప్రతి పాఠ్యాంశం కూడా చెరిపేయకుండా సేవ్ చేసుకోవచ్చు.

– డి.ప్రణీత, 10వ తరగతి విద్యార్థిని

సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులపై పట్టు



స్మార్ట్ స్క్రీన్‌ల ద్వారా ఉపాధ్యాయులు ప్రతి పాఠ్యాంశాన్ని ఎంతో అర్థమయ్యే రీతిలో ప్రయోగాత్మకంగా బోధిస్తున్నారు. ముఖ్యంగా మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి మాకు చాలా ఉపయోగపడుతుంది. మానవ శరీరంలోని ఆర్గాన్స్ పనిచేయు విధానాన్ని సైన్స్ ఉపాధ్యాయులు స్క్రీన్స్‌పై చక్కగా బోధిస్తున్నారు.

– వై.రూప, 10వ తరగతి విద్యార్థిని

15 మంది వృద్ధులకు వైద్యసేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా 15 మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, పరిసర గ్రామాల పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని 15 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సంఘ సభ్యురాలు ఆలపాటి మాధవి ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా సేవలు ఆదర్శనీయం

తాడేపల్లిగూడెం అర్బన్ : మదర్‌థెరిస్సా సేవలు ఆదర్శనీయమని ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ రొక్కాల నాగబుజ్జి అన్నారు. మదర్‌థెరిస్సా జయంతిని పురస్కరించుకొని ఆదర్శ కమిటీ సభ్యులు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నాగబుజ్జి మాట్లాడుతూ భారతదేశంలో ఎంతోమంది పేదలకు సేవలందించిన సేవామూర్తి మదర్‌థెరిస్సా అని అన్నారు. ప్రతి ఒక్కరికీ విద్యను అందించాలనే లక్ష్యంతో చారిటీ ద్వారా విద్యాలయాలను నెలకొల్పామన్నారు. తాము అందిస్తున్న సేవలకు మదర్‌థెరిస్సా స్ఫూర్తి అని నాగబుజ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చదరంగంతో జ్ఞాపక శక్తి పెంపు

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: చదరంగం క్రీడతో విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి పెంపొందుతుందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం తణుకు ఆర్యవైశ్య సేవా సంఘం భవనంలో చెస్ మాస్టర్ కుడిపూడి చరణ్ ఆధ్వర్యాన విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి చదరంగం పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత దేశ ప్రాచీన క్రీడైన చదరంగం నేడు ప్రపంచ క్రీడా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. ముఖ్యంగా చదరంగంలో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రిని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు వైఎస్సార్ సీపీ పట్టణ కోశాధికారి ఎం.శేఖర్, ఎస్సై కె.శ్రీనివాసు, ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు ఎం.శ్రీనివాసు, మండల విద్యా శాఖాధికారులు మురళీ సత్యనారాయణ, వి.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- ఎల్.అగ్రహారంలో గడపగడపకు మన ప్రభుత్వం



ఎల్.అగ్రహారంలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్హతే ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. పారదర్శకంగా ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు ప్రజల మద్దతు మెండుగా ఉందని తెలిపారు. ఎన్నికలలో ఎప్పుడు వచ్చినా ప్రజల ఆశీర్వాదంతో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని ఆయన అన్నారు. తొలుత స్థానికంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, పీఆర్ డీఈ వీఎస్.వేణుగోపాల్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు వై.హరికిషోర్, పవన్‌కుమార్, బి.ఫణికుమార్, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్; చిక్కాల సత్యనారాయణ, జడ్డు హరిబాబు, గుమ్మళ్ళ తాతారావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకుమారి, నాయకులు నీలపాల రామన్న, కొత్తపల్లి ప్రసాద్, శీలంశెట్టి బాలాజీ, శీలంశెట్టి శివవెంకటేశ్వరరావు, బొద్దాని శ్రీనివాస్, కంకట రాజారత్నం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

భక్తులకు నాగమ్మ సారె ప్రసాదం పంపిణీ



ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

తణుకు అర్బన్: తణుకు జాతీయ రహదారి గౌతమి సాల్వెంట్ సమీపంలోని శ్రీ చక్ర సహిత నాగ దుర్గాదేవి తల్లి (నాగమ్మ తల్లి) ఆలయంలో ఆదివారం భక్తులకు అమ్మవారి సారె ప్రసాదాన్ని పంపిణీ చేశారు. శ్రావణ మాసం సందర్భంగా ప్రతి ఏటా నాగమ్మ తల్లికి భక్తులు సారె సమర్పణలో భాగంగా వివిధ రకాల మిఠాయిలు, అరటి గెల, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులను శనివారం సమర్పించారు. అమ్మవారి ముందు ఒకరోజు నిద్ర చేయించిన సారెను ఆదివారం భక్తులకు పంపిణీ చేశారు. తణుకు నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నాగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కానూరి వెంకటేశ్వరరావు, జగ్గమూడి దుర్గమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బేసిక్ స్కూలు పూర్వ విద్యార్థుల సమ్మేళనం



విప్పర్రులో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెంటపాడు: వారంతా 1985–86 సంవత్సరంలో ప్రసిద్ధి చెందిన పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ స్కూల్లో 10వ తరగతి చదివిన విద్యార్థులు. 37 ఏళ్ల అనంతరం తాము చదువుకున్న బేసిక్‌స్కూలు వేదికగా ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కుటుంబాలతో సంతోషంగా గడిపారు. ఆత్మీయంగా పలుకరించుకొని సహపంక్తి భోజనాలు చేసారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. పలు ప్రాంతాల్లో వివిధ ఉద్యోగ, వృత్తుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న స్కూలును అభివృద్ధి చేయాలని నిర్ణయించి విద్యార్థుల కోసం సైకిల్ షెడ్డు నిర్మించాలని తలంచారు. యుఎస్‌ఏలో ఉంటున్న పూర్వ విద్యార్థి కర్రి సురేష్‌రెడ్డి రూ.లక్ష, ఉమామహేశ్వరం గ్రామానికి చెందిన మరో విద్యార్థి ఎస్. సత్యనారాయణ రూ.70 వేలు, పాఠశాలలో సీసీ కెమెరాలు, ఇన్వెర్టర్లు ఏర్పాటుకు యుఎస్‌ఏలో ఉంటున్న పూర్వ విద్యార్థి ఆర్. నగేష్ రూ.65 వేలు ఇచ్చేందుకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దాతలను పూర్వ విద్యార్థి, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించి వారిని సత్కరించారు. తమ బ్యాచ్ ఆధ్వర్యంలో స్కూలును అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు నల్లమిల్లి పార్వతి, కొవ్వూరి సుధ, కొప్పిశెట్టి వెంకటరాజు, పంచముఖి వెంకటరాము, జగదీష్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మానవత సేవలు అభినందనీయం



చెక్కును అందజేస్తున్న సంస్థ సభ్యులు

తణుకు టౌన్: మానవత సంస్థ విలువలతో కూడిన సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని పలువురు దాతలు అన్నారు. ఆదివారం తణుకు రోటరీ క్లబ్‌లో మానవత సంస్థ అధ్యక్షుడు ఎ.బాలాజీ అధ్యక్షతన జరిగిన తణుకు మానవత సంస్థ సమావేశంలో దాతలు కందుకూరి పద్మావతి, అక్కిన పద్మజ మాట్లాడుతూ మానవత సంస్థ చేపట్టిన పలు సేవా కార్యక్రమాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినికి ఫీజు నిమిత్తం రూ.10,000 ఆర్థికసాయం అందజేశారు. మానవత సంస్థ రూ.5 వేలు, దాత అక్కిన కాశీ కుమార్తె పద్మజ రూ.5 వేలు మొత్తం రూ.10 వేలు చెక్కును విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, కార్యదర్శి ఆలపాటి సోమేశ్వరరావు, కోశాధికారి ఎ.కాశీ, ఆనందం మస్తాన్‌రావు, ఆలపాటి సుబ్బారావు, బి.రామకాశీ పాల్గొన్నారు.

శివాలయంలో నదీ జలాలతో అభిషేకం



జట్లపాలెం శివాలయంలో అభిషేకం కోసం కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

పెంటపాడు: జట్లపాలెం కోనేరు చెరువు వద్ద శివాలయంలో నీలకంఠస్వామిగా పేరుగాంచిన సోమేశ్వరునికి, ఉమాదేవికి శ్రావణమాసం పురస్కరించుకొని ఆదివారం 108 మంది మహిళలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న వినాయకునికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నదీజలాలను కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. కోనేరు చెరువు వద్ద శివాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం దేవేరులను ఘనంగా అభిషేకించారు. స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 500 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చురుగ్గా డ్రెయినేజీ నిర్మాణం



ములపర్రు పితానివారి పాలెంలో డ్రెయినేజీని నిర్మిస్తున్న దృశ్యం

పెనుగొండ: ములపర్రు శివారు పితానివారి పాలెంలో డ్రెయినేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 15 ఏళ్లుగా డ్రెయినేజీ నిర్మాణం కోసం గ్రామస్తులు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగారు. అయినా మురుగు సమస్యకు పరిష్కారం లభించలేదు. ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మురుగు, డ్రెయినేజీ సమస్యలను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారానికి ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పితానివారి పాలెంలో రూ.18 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. దీనితో పాటు సీతారాముని చెరువులో సైతం డ్రెయినేజీ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. త్వరలో డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేసిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద)లకు ఆయా ప్రాంతాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

తణుకు డిగ్రీ కళాశాలకు కుర్చీల వితరణ



దాత కామర్సు వాణీనాథరావును సత్కరిస్తున్న అధ్యాపకులు

తణుకు: చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి తన ఔదార్యం చాటుకున్నారు. కళాశాల విద్యార్థుల కోసం రూ.3 లక్షల విలువైన 100 ప్యాడ్ ఫోల్డింగ్ కుర్చీలను ఆదివారం అందజేశారు. 1972–76 సంవత్సరంలో బీఎస్సీ చదువుకుని అమెరికా ఓహియో విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా స్థిరపడిన తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన కామర్సు వాణీనాధరావు విద్యార్థులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా దాత వాణీనాధరావును కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.మారుతీదేవి చౌదరి, కళాశాల పూర్వ విద్యార్థుల కో ఆర్డినేటర్ ఆర్ఎస్ఎం భూపాల్, పూర్వ విద్యార్థులు కె.బాలకృష్ణ, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ఆకివీడు: ఆకివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గ ప్రమాణస్వీకారం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్కే రసూల్ బీబీ చెప్పారు. ఆకివీడులోని తన నివాసంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనకు ఏఎంసీ చైర్మన్ పదవి కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా తన నివాసం నుంచి మోటారు సైకిల్ ర్యాలీతో ఏఎంసీ కార్యాలయానికి చేరుకుంటామని చెప్పారు. ప్రమాణస్వీకారోత్సవానికి వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు హాజరుకావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ హుస్సేన్, ఏఎంసీ డైరెక్టర్లు శిరపు శ్రీనివాస్, గంటా ఆనందరావు, మంతెన లక్ష్మీ సూర్యకుమారి, పడమట సుబ్బయ్య, నిమ్మల వెంకటరత్నం, బొండాడ జేష్ మేరీ, ఊడిగ లక్ష్మీ, మెంటే మరియమ్మ, బొక్కా శ్రీనివాస్, శలా సుబ్బలక్ష్మీ, జెట్ల దివ్య, సంగాని కనక లక్ష్మి, మంతెన సీతారామరాజు, నాయకులు పాల్గొన్నారు.

వేద విద్యార్థులకు పట్టాల పంపిణీ

ఆకివీడు: వేద విద్యార్థులు ఉన్నతమైన చదువులు చదివి సమాజానికి విలువైన సేవలందించాలని మాజీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు పిలుపునిచ్చారు. మండలంలోని అయిభీమవరం గ్రామంలోని శ్రీవెంకటేశ్వరా వేద పాఠశాల నాలుగో స్నాతకోత్సవ సభ ఆదివారం జరిగింది. సభకు ప్రిన్సిపాల్ కేవీఎస్ కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాపిరాజు మాట్లాడుతూ వేద పాఠశాలలోని విద్యార్థులు వేదం పఠించడం పట్ల మరింత ఆసక్తి చూపాలన్నారు. శుక్ల యజుర్వేదం పూర్తి చేసిన నలుగురు విద్యార్థులు, కృష్ణ యజుర్వేదం పూర్తి చేసిన విద్యార్థి, అథర్వణ వేదం పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో వేద అధ్యాపకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395, 63097 62918
తణుకు: 90108 43311, 90100 51493
Office mail : tpgadvt@gmail.com